

నరసాపురం - ధర్మవరం ఎక్స్‌ప్రెస్ రైలుకు అదనపు ఏసి భోగి



ప్రజాశక్తి - పాలకొల్లు

నరసాపురం - ధర్మవరం ఎక్స్‌ప్రెస్ రైలుకు మే 1వ తేదీ వరకూ అదనంగా ఎసి కోచ్ ఏర్పాటు చేస్తూ రైల్వేశాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ రైలుకు ప్రస్తుతం ఎసి త్రీటైర్ మూడు కోచ్‌లు, ఎసి టూ టైర్ ఒక కోచ్ అందుబాటులో ఉన్నాయి. అదనంగా అందుబాటులోకి తీసుకొస్తున్న కోచ్‌లో సగం ఎసి ఫస్ట్ క్లాస్, మిగిలిన సగం ఎసి సెకండ్ క్లాస్ కేటాయించనున్నట్లు పాలకొల్లు రైల్వే అధికారులు తెలిపారు.

50 గ్రామాల్లో.. దాహం.. దాహం..!

జిల్లాలో ఏదో ఒకచోట నీటి కష్టాలు చూస్తూనే ఉంటాం. అయితే పశ్చిమగోదావరి జిల్లా నుంచి ఎక్కడికెళ్లినా మీకేం కష్టాలు అంటారు.. చక్కగా గోదావరి ఉంది.. తాగేందుకు నీరు.. పంటలు పుష్కలంగా పండించేందుకు సాగునీరు ఉందని అంటుంటారు. ఇది వినడానికి బాగానే ఉన్నా.. ఇక్కడ క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితులు దానికి విరుద్ధంగా కన్పిస్తాయి. ఎందుకంటే చుట్టూ నీరున్నా తాగడానికి పనికిరావు. ఇదంతా మన పాలకుల మహత్యమే. నీటి వనరుల సంరక్షణ మాని, అసంబద్ధ విధానాలతో ఉన్న నీటి వనరులను కలుషితమయం చేశారనడంలో ఎటువంటి సందేహమూ లేదు. దీంతో తాగడానికి నీరు లేకపోగా.. కలుషిత వాతావరణం వల్ల దీర్ఘకాలిక వ్యాధులు ప్రజలను కబళిస్తున్నాయి.

వెంకయ్య వయ్యేరు ప్రాజెక్టు పనులు పూర్తికాని ఫలితం - ప్రజలకు అందని రక్షిత తాగునీరు



వెంకయ్య వయ్యేరులో పేరుకుపోయిన గుర్రపు డెక్క

ప్రజాశక్తి - కాళ్ల

డెల్టాలోని ప్రధాన కాల్వల్లో వెంకయ్య వయ్యేరు కాల్వ ఒకటి. ఆ పంట కాల్వ పక్కనే ఉన్న నీరు తాగడానికి పనికి రాదని నిపుణులు తేల్చేశారంటే పరిస్థితి ఎంత దారుణంగా తయారైందో అర్థం చేసుకోవచ్చు. దీంతో వేలాది మంది ప్రజలు దాహార్తితో అలమటిస్తున్నారు. జిల్లాలోని ఐదు మండలాలకు చెందిన 50 గ్రామాల ప్రజలకు వెంకయ్య వయ్యేరు కాల్వ నీరే ఆధారం. దీంతో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ప్రత్యేక తాగునీటి ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. పనులు సగం వరకూ పూర్తి చేశాక అర్థాంతరంగా నిలిచిపోయాయి. దీంతో ఇప్పటి వరకూ నిర్మించిన కట్టడాలు శిథిలావస్థకు చేరుతున్నాయి. దీనికి నిలువెత్తు నిదర్శనం రూ.30 కోట్ల విలువైన పైపులైన్ పనులు.

కాలువ పారేదిలా..!

వెంకయ్య వయ్యేరు కాలువ పెంటపాడు మండలం పరిమెళ్ల లాకుల దిగువన ప్రారంభమవుతోంది. గణపవరం మండలం కొమ్మర, వాకపల్లి, గణపవరం, సరిపల్లి, నిడమర్రు మండలం భువనపల్లి, బావాయిపాలెం, క్రొవ్విడి, ఉండి మండలం పెదకాపవరం, గొల్లగూడెం, క్షత్రియపురం, ఆకివీడు మండలం పెదకాపవరం మీదుగా చినకాపవరం వైర్లు వద్ద కలుస్తుంది. చినకాపవరం వద్ద కాలువ రెండు పాయలుగా చీలి ఒకటి చినకాపవరం కాలువగా, మరొకటి కొత్త వెంకయ్య వయ్యేరు (ఏలూరుపాడు) కాలువగా ప్రవహిస్తోంది. కొత్త వెంకయ్య వయ్యేరు కాలువ నీరు ఆకివీడు, కాళ్ల మండలాల్లోని సుమారు 20 కిలోమీటర్లు పొడవునా ప్రవహించి కాళ్ల మండలం కలవపూడి శివారు ఉప్పుటేరులోకి కలుస్తుంది. చినకాపవరం కాలువ ఎనిమిది కిలోమీటర్లు ప్రవహించి ఆకివీడు మండలం సిద్ధాపురం వద్ద ఉప్పుటేరులో కలుస్తుంది. పరిమెళ్ల లాకుల నుంచి 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న చినకాపవరం వరకూ వైర్లు నిర్మించారు. వైర్లు వద్ద ఐదు అడుగులకు వించి నీరు వస్తే ఉప్పుటేరులోకి విడుదల చేస్తారు.

300 మురుగు కాల్వల నీరు ఈ కాలువలోకే..!

పరిమెళ్ల దిగువన ఉన్న కాశిపాడు, కొమ్మర వద్ద బోడపాడు, సరిపల్లెలో పాలకోడు, వెంకాయమ్మ కోడు, విల్లకోడు, మసికోడు, భువనపల్లి కోడు, వాలుకోడు, బొండాడకోడు, సంఘకోడు వంటి 300 మురుగు కాలువల నీరు వెంకయ్య వయ్యేరులో కలుస్తోంది. అదేవిధంగా రైస్‌మిల్లు మురుగు సుమారు 20 వేల ఎకరాల పంట పొలాల్లో మురుగు వేలాది ఎకరాల చేపలు, రొయ్యల చెరువుల్లో కలుషిత నీరు వెంకయ్య వయ్యేరులోనే కలుస్తుంది. దీనికి తోడు గణపవరంలో గ్రామస్తులు, హోటళ్లలో వాడకం నీరు చెత్తాచెదారం వయ్యేరులోకి వదిలేస్తున్నారు. గణపవరం, క్రొవ్విడి గ్రామాల్లో శ్మశానవాటికలు ఈ కాలువ గట్లపైనే ఉన్నాయి. దీంతో వెంకయ్య వయ్యేరు కాలుష్య కోరల్లో చిక్కుకుని విలవిల్లాడుతోంది. కాలువలో ఎప్పుడూ 400 ఘనపటడుగుల నీరు నిల్వ ఉండటంతో చిన్నపాటి వర్షానికి వేలాది ఎకరాలు ముంపునకు గురవుతున్నాయి.

ఈ సమస్యను 2004లో అప్పటి ఉండి ఎంఎల్‌ఎ పాతపాటి సర్రాజు అప్పటి సిఎం రాజశేఖర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయా గ్రామాల్లో తాగునీరందించాలనే బృహత్తర ఆశయంతో 2006లో వైఎస్‌ఆర్ రూ.30 కోట్లతో తాగునీటి ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. అయినా నిధులు లేమి, రెండు పర్యాయాలు ఎంఎల్‌ఎగా పని చేసిన శివరామరాజు, ప్రస్తుత ఎంఎల్‌ఎ మంతెన రామరాజు శ్రద్ధ చూపకపోవడంతో పనులు పూర్తి కాలేదు. పెంటపాడు మండలం పరిమళ్ల లాకుల నుండి కాళ్ల మండలం కలవపూడి వరకూ కాలువ గట్టు వెంట సుమారు 40 కిలోమీటర్ల పొడవునా పైప్‌లైన్ నిర్మించేందుకు రూపకల్పన చేశారు. రెండు విడతలుగా అప్పటి ప్రభుత్వం రూ.18 కోట్లు మంజూరు చేసింది. మొదటి దశ పనులను 2006లో రూ.10 కోట్లతో ప్రారంభించారు. పరిమెళ్ల లాకుల నుంచి ఆకివీడు మండలం గుమ్ములూరు వరకూ 25 కిలోమీటర్ల మేర భారీ పైప్‌లైన్ నిర్మించారు. పరిమెళ్ల లాకుల వద్ద 3.5 లక్షల సామర్థ్యం కలిగిన ఒ.హెచ్‌.ఎస్‌ఆర్ ట్యాంక్, గుమ్ములూరు వద్ద 2.5 లక్షల సామర్థ్యం గల ట్యాంకు, భారీస్థాయిలో సంపు నిర్మించారు. 30 కిలోమీటర్ల మేర పివిసి పైపులతో ప్రధాన పైపులైన్ నుంచి గ్రామాల్లోని తాగునీటి చెరువులకు అనుసంధానించారు. ఈ పనులు 2008 జూన్‌లో పూర్తయ్యాయి. వీటిలో అధిక శాతం ప్రస్తుతం శిథిలావస్థకు చేరుతున్నాయి.



వెంకయ్య వయ్యేరులో వేసిన పైప్‌లైన్

రెండో దశ పనులను 2009లో రూ.8 కోట్లతో ప్రారంభించారు. ఆకివీడు మండలం గుమ్ములూరు నుంచి కాళ్ల మండలం వరకూ సుమారు 14 కిలోమీటర్ల మేర పైపులైన్ ఏర్పాటు చేశారు. గ్రామాల్లోని తాగునీటి చెరువులను ప్రధాన పైపులైన్‌తో అనుసంధానం చేశారు. పరిమెళ్ల లాకుల వద్ద 100 హెచ్‌పి విద్యుత్ మోటర్లు మూడు, గుమ్ములూరు వద్ద 40 హెచ్‌పి మోటార్లు మూడు, 24 గంటలు విద్యుత్ సరఫరాకు ప్రత్యేక విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేశారు. ఈ పనులు 2011 డిసెంబర్ నాటికి పూర్తయ్యాయి. మొదటి, రెండో విడతల్లో చేసిన పనులు పొంతన లేకుండా సాగాయి. మొదటి విడతలో చేయాల్సిన పనుల్లో విద్యుత్ కనెక్షన్లు, మోటార్లు ఏర్పాటు చేయలేదు. రెండో విడత పనులు పూర్తయ్యేసరికి మొదటి దశలో నిర్మించిన పైపులు వెంకయ్యవయ్యేరులోకి జారిపోతున్నాయి. ఇక మూడో విడతలో చేయాల్సిన పనులపై ఇంతవరకూ స్పష్టత లేదు.

పునర్నిర్మాణ పనులు..

తాగునీటి ప్రాజెక్టు ప్రజలకు అందుబాటులోకి తేవాలని 2014-15లో మొదటి, రెండు విడత మిగులు నిధులతో పైప్‌లైన్ మరమ్మతులు చేపట్టారు. పరిమెళ్ల, కొమ్మర, గణపవరం, క్రొవ్విడి, పెదకాపవరం, చినకాపవరం, గుమ్ములూరు, తరటావ, కోళ్లపర్రు గ్రామాల పరిధిలో వెంకయ్యవయ్యేరు, చినకాపవరం డ్రెయిన్‌లోకి 12 చోట్ల జారిపోయిన సుమారు 960 మీటర్ల మేర పైపులను వెలికి తీసి కాంక్రీట్‌తో మళ్లీ ఏర్పాటు చేశారు. పనులన్నీ పూర్తి చేసి తాగునీటి పైపులైన్ ప్రాజెక్టు వినియోగంలోకి తీసుకురావాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పైపులైన్ ప్రాజెక్టు అసంపూర్ణంగా నిలిచింది..

మంతెన రామరాజు, ఉండి ఎంఎల్‌ఎ



వెంకయ్య వయ్యేరు ప్రాజెక్టు పనులు రూ.30 కోట్లతో ఆర్భాటంగా ప్రారంభించిన పనులు ఇంకా పూర్తి కాలేదు. రూ.30 కోట్ల వరకూ ఖర్చు చేసినా 30 లీటర్ల నీళ్లు కూడా పైపుల ద్వారా వచ్చిన దాఖలాల్లేవు. సాంకేతికపరమైన అంచనాల్లో ఇంజినీరింగ్ అధికారుల, ప్రభుత్వ వైఫల్యం వల్ల చేపట్టిన పనులు నిరుపయోగంగా మారాయి. వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత వాటర్‌గ్రిడ్ ఏర్పాటు చేసి గోదావరి నుంచి పైప్‌లైన్ వేస్తామని ప్రతిపాదించినా కార్యరూపం దాల్చలేదు. తాగునీటి సమస్య తీవ్రమై కేన్సర్, కిడ్నీ వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరుగుతోంది. ప్రజా శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని గోదావరి నుంచి నీరు నేరుగా మంచినీటి చెరువులోకి వచ్చేలా పైపులైన్ ఏర్పాటు చేస్తే నీరు కలుషితం కాకుండా స్వచ్ఛమైన నీరు వస్తుంది.

గుర్తింపు కార్డుతో ఓటు హక్కును వినియోగించుకోండి

జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్



ప్రజాశక్తి - భీమవరం

ఎన్నికల్లో భాగంగా ఓటరు గుర్తింపు కార్డు చూపించి తమ ఓటు హక్కును వినియోగించుకోవాల్సి ఉంటుందని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సుమిత్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎపిక్ కార్డు లేని వారు ప్రత్యామ్నాయంగా ఫొటో గుర్తింపు కార్డులను చూపించి ఓటు వేయవచ్చని పేర్కొన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎపిక్ జారీ చేయబడిన ఓటర్లు ఓటు వేసే ముందు గుర్తింపు కోసం తమ ఎపిక్‌ను పోలింగ్ కేంద్రాల్లో చూపించి ఓటు వేయాలని తెలిపారు. ఎపిక్ లభ్యంగా లేని ఓటర్లు ప్రత్యామ్నాయ ఫొటో గుర్తింపు పత్రాల్లో ఒకదాన్ని చూపించి వారి ఓటు హక్కును వినియోగించుకోవచ్చని సూచించారు. ఆధార్ కార్డ్, జాబ్ కార్డ్, పోస్టాఫీసు జారీ చేసిన ఫొటోతో కూడిన పాస్‌బుక్‌లు, కార్మిక మంత్రిత్వ శాఖ పథకం కింద జారీ చేసిన ఆరోగ్య బీమా స్మార్ట్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాన్ కార్డు, ఎన్‌ఆర్‌పి కింద ఆర్‌జిఐ జారీ చేసిన స్మార్ట్ కార్డ్, భారతీయ పాస్‌పోర్ట్, ఫొటోతో కూడిన పెన్షన్ డాక్యుమెంట్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం, పిఎస్‌యులు పబ్లిక్ లిమిటెడ్ కంపెనీల ద్వారా ఉద్యోగులకు జారీ చేసిన ఫొటోతో కూడిన సేవా గుర్తింపు కార్డులు, ఎంపీలు, ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలకు జారీ చేసిన అధికారిక గుర్తింపు కార్డులు, 12 రకాల గుర్తింపు కార్డులను ఓటర్లు పోలింగ్ కేంద్రాల్లో చూపించి ఓటు హక్కును వినియోగించుకోవచ్చని సూచించారు. ఎన్నికల కమిషన్ కల్పించిన ఈ అవకాశాన్ని ఓటర్లంతా అవగాహన కలిగి సద్వినియోగం చేసుకోవాలని, ఎన్నికల నాటికి సంబంధిత గుర్తింపు కార్డును సిద్ధంగా ఉంచుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు.



నరసాపురంలో నిర్మానుష్యంగా జాతీయ రహదారి

'సన్‌డే' సలసల.!

నిర్మానుష్యంగా రోడ్లు - ఎండ వేడిమికి జనం విలవిల

ప్రజాశక్తి - నరసాపురం

ఎండలు మండిపోతున్నాయి.. ఆదివారం ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో ప్రజలు విలవిల్లాడిపోతున్నారు. దీంతో బయటకు వెళ్లాలంటేనే ప్రయాణికులు బెంబేలెత్తిపోతున్నారు. మే నెల మాదిరిగా మార్చిలోనే ఎండలు బాగా పెరిగి 35 నుంచి 38 డిగ్రీలకు చేరుకుంటున్నాయి. మధ్యాహ్నం వేసవి తాపానికి తాళలేని జనం చెట్ల కిందకు చేరుకుంటున్నారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకూ ఎండ తగ్గకపోవడంతో ప్రయాణికులు సైతం ప్రయాణాలు వాయిదా వేసుకుంటున్నారు. గ్రామాల్లో, పట్టణంలో రోడ్లన్నీ నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. ఎండలు ఎక్కువగా ఉండడంతో కూల్ డ్రింకులు, శీతల పానీయాలు షాపులు, జ్యూస్ సెంటర్లు ఊపందుకున్నాయి. ఇప్పుడే ఇలా ఉంటే ఇక ఏప్రిల్, మేలో ఎండలు ఎలా ఉంటాయో అని జనం బెంబేలెత్తిపోతున్నారు. మధ్యాహ్న సమయంలో ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని, వడదెబ్బ బారిన పడకుండా నీరు ఎక్కువగా తాగాలని, నాలుగు దాటిన తర్వాతే ప్రయాణాలు కొనసాగించాలని, అవసరమైతే తప్ప బయటకు రావొద్దని వైద్యులు చెబుతున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా రాజకీయ నేతలకు ఎక్కువ దెబ్బ తగులుతోంది. ఎప్పుడూ ఎసి గదుల్లో గడిపే రాజకీయ నేతలకు ఎండ తీవ్రత ఎక్కువగా తగులుతోంది. మధ్యాహ్న భోజన సమయాల్లో ప్రచారానికి బ్రేక్ ఇస్తున్నారు. పగటి పూట కంటే రాత్రి సమయంలో గ్రామాల్లో సమావేశపర్చి నాయకులను, ఓటర్లను కలుస్తున్నారు.

స్వర్ణాంధ్రలో ఉచితంగా 'పాలిసెట్' శిక్షణ

ప్రజాశక్తి - నరసాపురం

మండలంలోని సీతారామపురం గ్రామం స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ కళాశాలలో పాలిసెట్ పరీక్షకు సన్నద్ధమవుతున్న పదో తరగతి విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎంఎస్.కిరణ్మయి తెలిపారు. ఏప్రిల్ 1వ తేదీ నుంచి 25వ తేదీ వరకూ విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యంతోపాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణతో పాటు పాలిటెక్నిక్‌కు సంబంధించిన పాఠ్యపుస్తకాలు విద్యార్థులకు ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు. అంతేగాక శిక్షణ అనంతరం కళాశాలలో పాలిటెక్నిక్ నమూనా పరీక్ష నిర్వహిస్తామన్నారు. ఈ అవకాశాన్ని పాలిసెట్ పరీక్ష రాసే విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపల్ తెలిపారు. మరిన్ని వివరాలకు : 8790663466, 9640435517కి సంప్రదించాలన్నారు.

సాగరతీరం.. ఆనందకరం

ప్రజాశక్తి - మొగల్తూరు



సముద్ర కెరటాల్లో స్నానాలు చేస్తున్న పర్యాటకులు


మండలంలోని పేరు పాలెంబీచ్‌లో ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందేందుకు పర్యాటకులు, ప్రకృతి ప్రేమికులు ప్రత్యేక, ద్విచక్ర వాహనాల్లో బీచ్‌కు ఉదయమే చేరుకున్నారు. పలువురు సముద్ర కెరటాల్లో స్నానాలు చేశారు. చిన్నారులు ఒడ్డుకు కొట్టుకొస్తున్న కెరటాలతో ఇసుక తేనెలపై ఆటలాడుకున్నారు. అనంతరం ఒడ్డున ఉన్న ఆలయాలను దర్శించుకుని, సరివే కొబ్బరి తోటల్లో సహపంక్తి భోజనాలు చేసి సేదతీరారు.

రోడ్డెక్కిన తెలుగు తమ్ముళ్లు

ఐదుగురిని సస్పెండ్ చేయాలని మండల నేతల తీర్మానం

మండల నేతలను సస్పెండ్ చేయాలని నారాయణపురం గ్రామ కమిటీ డిమాండ్

వాడీవేడిగా ఉంగుటూరు రాజకీయం



సొంత పార్టీ నాయకులను సస్పెండ్ చేయాలంటూ డిమాండ్ చేస్తున్న నారాయణపురం టిడిపి నాయకులు

ప్రజాశక్తి - ఉంగుటూరు

మండలంలోని తెలుగుదేశం పార్టీలో విభేదాలు తారాస్థాయికి చేరుకున్నాయి. ఉంగుటూరు సీటును పొత్తులో భాగంగా జనసేనకు కేటాయించారు. అప్పటి నుంచి టిడిపి, జనసేన మధ్య వివాదం నడుస్తోంది. జనసేన అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు ద్వారకాతిరుమల పాదయాత్ర శుక్రవారం రాత్రి నారాయణపురం చేరినప్పుడు టిడిపి మండల అధ్యక్షుడు పాతూరి విజయ్‌కుమార్, మాజీ ఎంపిపి గోలి శ్రీనులపై టిడిపికే చెందిన నారాయణపురం నేతలు దాడికి పాల్పడ్డారని విజయకుమార్ గ్రూపు ఆరోపిస్తుంది. దీంతో టిడిపిలో గ్రూపు విభేదాలు రోడ్డున పడ్డాయి. ఆ తర్వాత శనివారం జరిగిన టిడిపి మండల కమిటీ అత్యవసర సమావేశంలో దాడికి పాల్పడిన నారాయణపురానికి చెందిన టిడిపి గ్రామాధ్యక్షుడు, మండల కార్యదర్శి, మరో ముగ్గురిని సస్పెండు చేస్తున్నామని, దీన్ని ఆమోదించాలంటూ తీర్మానించి లేఖను క్రమ శిక్షణా కమిటీ, జిల్లా పార్టీకి పంపారు. అయితే సస్పెన్షన్‌కు గురైన నాయకులకు సంఘీభావంగా నారాయణపురానికి చెందిన కొంత మంది నాయకులు, కార్యకర్తలు మండల కమిటీతోపాటు పలువురు రాష్ట్ర స్థాయి నేతలపై ఘాటైన ఆరోపణలు చేశారు. మండల పార్టీ అధ్యక్షుడుతో పాటు పార్టీ ప్రతిష్టను దెబ్బతీస్తున్న పలువురు పేర్లతో లేఖ రాసి వారిని సస్పెండ్ చేయాలని టిడిపి నారాయణపురం గ్రామాధ్యక్షుడు వీరబాబు, మండల కార్యదర్శి ఆనంద్ తదితరులు డిమాండ్ చేశారు. ఈ లేఖను భీమడోలులోని పార్టీ కార్యాలయం ప్రతినిధికి ఆదివారం అందజేశారు. ఉంగుటూరు నియోజకవర్గంలో టిడిపిలో ఎన్నడూ బహిర్గతం కాని గ్రూపు విభేదాలు రోడ్డున పడటంతో రానున్న రోజుల్లో ఏ పరిణామాలు చోటుచేసుకుంటాయోననే చర్చ ప్రారంభమైంది. ఏదేమైనా జనసేన అభ్యర్థిని ప్రకటించినప్పటి నుంచి ఉంగుటూరు నియోజకవర్గ టిడిపి శ్రేణుల్లో అలజడి ప్రారంభమైందనడంలో ఎటువంటి సందేహమూ లేదని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

22 మంది వాలంటీర్లు రాజీనామా

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భీమవరంలో 39వ వార్డుకు చెందిన 22 మంది వాలంటీర్లు ఆదివారం మూకుమ్మడిగా రాజీనామా చేశారు. ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్‌ను కలవడానికి కార్యాలయానికి వచ్చిన వాలంటీర్లు మాట్లాడుతూ ఎన్నాళ్లు ప్రజలకు సేవచేసినా తమను ఎన్నికల పేరుతో ఎక్కడైనా క్లస్టర్లలో కనిపిస్తే ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేస్తామని జనసేన, టిడిపి కార్యకర్తలు బెదిరిస్తున్నారని వారు ఆరోపించారు. దీంతో తాము రాజీనామాకు సిద్ధపడ్డామని తెలిపారు. అలాగే వైసిపిలో చేరి పార్టీ అభివృద్ధికి కృషిచేసి జగన్‌ను సిఎంను చేస్తామని, ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్‌ను మరలా గెలిపించుకుంటామని తెలిపారు.

ప్రజా కళాకారుడు అప్పారావు మృతి

ప్రజాశక్తి - అత్తిలి




అప్పారావు (ఫైల్ ఫొటో)

సిపిఎం మంచిలి గ్రామ సీనియర్ సభ్యులు, ప్రజా కళాకారుడు కలిగొట్ల అప్పారావు (75) ఆదివారం మంచిలిలో తన స్వగృహంలో అనారోగ్యంతో తుదిశ్వాస విడిచారు. మంచి స్వరం, కంఠం ఉండడంతో సిపిఎం కార్యక్రమాలను మైక్ ద్వారా అనౌన్స్ చేస్తూ చుట్టుపక్కల గ్రామాల్లో ప్రచారం నిర్వహించేవారు. కంజిరి కథ కళారూపాల ప్రదర్శనలో ఆయన దిట్ట. వందలాది వేదికలపై ఆ కళారూపాన్ని ప్రదర్శించి అందరికీ సుపరిచితులయ్యారు. అప్పారావు మృతి పట్ల సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేతా గోపాలన్‌తోపాటు సిపిఎం మండల, మంచిలి గ్రామ శాఖ సంతాపం తెలిపాయి. అప్పారావు మృతి ప్రజా ఉద్యమానికి తీరని లోటని గోపాలన్ అన్నారు. 50 సంవత్సరాలుగా కమ్యూనిస్టు ఉద్యమంతో సుదీర్ఘకాలం సంబంధం కలిగి ఉన్నారని తెలిపారు. సిపిఎం తణుకు డివిజన్ కమిటీ సభ్యులుగా, అత్తిలి మండల సభ్యులుగా, ప్రజానాట్యమండలి జిల్లా కమిటీ సభ్యులుగా పనిచేశారని తెలిపారు. అప్పారావు మృతి పట్ల కె.ధర్మేంద్ర, ఎం.సురేష్, పాతాళ పద్మారావు, రాగిరెడ్డి వెంకట్రావు, ధర్మేంద్ర, అప్పన్న రాంబాబు, నక్కా శ్రీనివాస్ సంతాపం తెలిపారు.

శ్రీదేవి రామారావు దంపతులకు సత్కారం

ప్రజాశక్తి - మొగల్తూరు

ఎంతోమంది విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దిన నిప్పులేటి శ్రీదేవి తారకరామారావు ధన్యజీవని వైన్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ చినమిల్లి సత్యనారాయణ అన్నారు. మొగల్తూరులోని పెనుమత్స రంగరాజు జెడ్‌పి ఉన్నత పాఠశాలలో ఆదివారం నిప్పులేటి శ్రీదేవి తారక రామారావు ఉద్యోగ విరమణ సందర్భంగా ఏర్పాటు చేసిన వీడ్కోలు సభను పాఠశాల ప్రధానోపాధ్యాయులు వర్ధమాని రవిశంకర్ సర్కార్ అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు శ్రీదేవిని కొనియాడారు. ఈ సందర్భంగా మాజీ జెడ్‌పిటిసి సభ్యులు గుబ్బల నాగరాజు, మాజీ సర్పంచి మామిడిశెట్టి సత్యనారాయణ, సొసైటీ మాజీ అధ్యక్షులు మేడిది బాబ్జి, కలిదిండి కుమార్ బాబు, కొట్టు రామాంజనేయులు పులపర్తి సుబ్రహ్మణ్యం సిపిఎం నాయకులు కొత్త విజయకుమార్, ఎంపిటిసి సభ్యులు అందే దొరబాబు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, పలువురు గ్రామస్తులు శ్రీదేవి తారక రామారావు దంపతులను ఘనంగా సత్కరించారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు.



శ్రీదేవి రామారావు దంపతులను సత్కరిస్తున్న పాఠశాల సిబ్బంది



పాలకొల్లులో పూల ధరలకు రెక్కలు

పూల ధరలకు రెక్కలు

ఈస్టర్, వివాహ వేడుకల నేపథ్యంలో పెరిగిన ధరలు


ప్రజాశక్తి - పాలకొల్లు

మార్కెట్లో పూల ధరలకు రెక్కలొచ్చాయి. ఎండలు పెరగడం, ఈస్టర్ పండుగ, వివాహ వేడుకల సందర్భంగా ఆదివారం మార్కెట్లో పూల ధరలు భగ్గుమన్నాయి. కిలో చామంతులు రూ.400, బంతిపూలు కిలో రూ.200, గులాబీలు కిలో రూ.500, మల్లెపూలు మూర రూ.80 నుంచి రూ.వంద, కనకాంబరాలు మూర రూ.వంద నుంచి రూ.150 వరకూ విక్రయిస్తున్నారు. దీంతో సామాన్య, మధ్యతరగతి మహిళలకు అందుబాటులోకి పూలు రానంటున్నాయి. వేసవి తీవ్రతతో పూల దిగుబడి తగ్గి ధరలు పెరగడానికి కారణమని పూల వ్యాపారి షేక్ మహబూబ్ జానీ చెప్పారు.

నవోదయకు హోలీ ఏంజెల్స్ విద్యార్థులు

ప్రజాశక్తి - ఆచంట

జవహర్ నవోదయ విద్యాలయ ప్రవేశ పరీక్షల్లో 2024-2025 విద్యా సంవత్సరానికి కొడమంచిలి హోలీ ఏంజెల్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు తమ ప్రతిభ కనపర్చి సీట్లు సాధించారు. ఈ సందర్భంగా స్కూలు కరస్పాండెంట్ రవి కుమార్, ప్రిన్సిపల్ కృష్ణవేణి హర్షం వ్యక్తం చేశారు. నవోదయలో సీట్లు సాధించిన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు స్కూల్ సిబ్బంది అభినందనలు తెలిపారు.


మైక్ సెట్ బహూకరించిన విద్యార్థులు

పాఠశాలకు మైక్ సెట్ బహూకరణ

ప్రజాశక్తి - గణపవరం


మండలంలోని జల్లికొమ్మర ఉన్నత పాఠశాలకు విద్యార్థులు ఆదివారం రూ.20 వేల విలువైన వైర్లెస్ మైక్ సెట్‌ను పాఠశాలకు బహూకరించినట్లు ప్రధానోపాధ్యాయులు కలకం సుందరకుమార్ తెలిపారు. 2022-2023 సంవత్సరంలో ఎనిమిదో తరగతి పూర్తిచేసిన విద్యార్థులు, ప్రస్తుతం 2023-2024 సంవత్సరంలో చదువుతున్న విద్యార్థులు కలిసి మైక్‌సెట్‌ను అందించినట్లు చెప్పారు. పాఠశాల అభివృద్ధిలో భాగస్వామి అయిన విద్యార్థులను ఉపాధ్యాయులు సౌజన్య, శ్రీదేవి, పార్వతి, సిహెచ్.లీలాకుమార్, రమేష్, శిరీష విద్యార్థులను అభినందించారు.

బిసిల నాయకత్వాన్ని విస్మరించిన జగన్

రాష్ట్ర కళింగ నాయకులు కోన రవికుమార్

ప్రజాశక్తి - ఆకివీడు

బిసిల నాయకత్వాన్ని జగన్ విస్మరించారని, బిసిలపై ఆయనకు ఏ విధమైన ప్రేమ లేదని టిడిపి శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు ఎంఎల్ఎ అభ్యర్థి, రాష్ట్ర కళింగ నాయకులు కోన రవికుమార్ విమర్శించారు. జయహో బిసి పేరుతో మండలంలోని కళింగ గూడి గ్రామంలో ఆదివారం రాత్రి టిడిపి ఆధ్వర్యంలో బిసి సదస్సు నిర్వహించారు. టిడిపి ఉండి ఎంఎల్ఎ అభ్యర్థి మంతెన రామరాజు అధ్యక్షతన నిర్వహించిన సభలో కోన రవికుమార్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బిసిలకు ఉన్న 34 శాతం రిజర్వేషన్‌ను జగన్ 24 శాతానికి తగ్గించారన్నారు. రాష్ట్రాన్ని జగన్ అప్పుల ఊబిలోకి నెట్టారన్నారు. రాష్ట్రంలో 45 శాతం ఆదాయం ఆక్వా రంగంలో వస్తుందని, జగన్ ఈ ప్రాంతాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశారని చెప్పారు. చంద్రబాబు హయాంలో 130 పథకాలు అమలులో ఉండేవని, వాటిని రద్దుచేసి ప్రజలకు ఒట్టి చేతులు చూపిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ కన్వీనర్ నాగరాజు, బిజెపి మండలాధ్యక్షులు ఏడుకొండలు పాల్గొన్నారు.


ప్రచారంలో ముదునూరి ప్రసాదరాజు

వైసిపితోనే రాష్ట్రాభివృద్ధి

చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు

ప్రజాశక్తి - నరసాపురం

రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే మరొకసారి జగన్ సిఎం కావాలని చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. పట్టణంలోని 25వ వార్డులో ఇంటింటా ప్రచారం కార్యక్రమంలో ప్రసాదరాజు తన కుమారుడు శ్రీకృష్ణంరాజుతో కలిసి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రసాదరాజు మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకొచ్చిన తర్వాత చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వార్డు ప్రజలకు వివరించారు. పార్టీ, కుల, మతాలకు అతీతంగా ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందించినట్లు చెప్పారు. నియోజవర్గం మరింత అభివృద్ధి చెందాలంటే ఫ్యాన్ గుర్తుకే ఓటేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ వెంకటరమణ, యర్రా శ్రీను, కేసరి గంగరాజు, జిల్లెల దిలీప్, హేమకుమార్ పాల్గొన్నారు.

పేరుపాలెం నార్త్‌లో ముదునూరి సతీమణి ప్రచారం

మొగల్తూరు : వచ్చే ఎన్నికల్లో వైసిపి ఎంఎల్ఎ అభ్యర్థి ముదునూరి ప్రసాదరాజును గెలిపించాలని ఆయన సతీమణి శారదావాణి అభ్యర్థించారు. మండలంలోని పేరుపాలెం నార్త్‌లో ప్రజ ఆశీర్వాద కార్యక్రమంలో భాగంగా ఆమె ఆదివారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఇంటింటికి వెళ్లి నియోజకవర్గ అభివృద్ధికి ప్రసాదరాజు చేసిన కృషిని వివరించారు. ఈ ప్రచారంలో మున్సిపల్ కౌన్సిలర్ కావలి రామసీత నాని, ఎంపిటిసి సభ్యులు డివివి.సత్యనారాయణ, నాయకులు అందే భుజంగరావు, కర్రి ఏసుబాబు, కవురు సాయి, వేగి బాబి, కోడెళ్లి వెంకట్రావు, చల్లా రామరాజు ఉన్నారు.

నేడు ముత్యాలపల్లిలో..

మండలంలోని ముత్యాలపల్లిలో సోమవారం ప్రజా ఆశీర్వాద ఎన్నికల ప్రచార కార్యక్రమం నిర్వహించనున్నట్లు ముదునూరి ప్రసాదరాజు కార్యాలయ సిబ్బంది తెలిపారు. గ్రామంలోని బండి ముత్యాలమ్మ ఆలయం నుంచి ప్రారంభ మయ్యే ఈ కార్యక్రమంలో ముదునూరి ప్రసాదరాజు పాల్గొంటారని తెలిపారు.

టిడిపి కూటమితోనే యువతకు భవిష్యత్తు

ఎంఎల్ఎ మంతెన రామరాజు

ప్రజాశక్తి - ఉండి

టిడిపి కూటమితోనే యువతకు బంగారు భవిష్యత్తు సాధ్యమని టిడిపి ఉండి ఎంఎల్ఎ అభ్యర్థి మంతెన రామరాజు, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు అన్నారు. ఉండిలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ మండలాధ్యక్షులు కరిమెరక నాగరాజు ఆధ్వర్యంలో ఎంఎల్ఎ మంతెన రామరాజు సమక్షంలో సుమారు 150 మంది యువకులు టిడిపిలో, 20 మంది యువకులు జుత్తిగ నాగరాజు సమక్షంలో జనసేన పార్టీలో చేరారు. వీరికి ఎంఎల్ఎ మంతెన రామరాజు, జుత్తిగ నాగరాజు పార్టీ కండువా కప్పి సాదారంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి అధికారం చేపట్టిన నాటి నుంచి రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందన్నారు. ప్రతి ఏడాది జాబ్ క్యాలెండర్ తీసుకొస్తామని ప్రగల్భాలు పలికిన సిఎం జగన్ మాట తప్పాడని ఎద్దేవా చేశారు. టిడిపి కూటమి అధికారం చేపట్టిన తర్వాత యువతకు ఉపాధి కల్పించి పరిశ్రమలు తీసుకొచ్చేందుకు కృషి చేస్తామని వారు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి జుత్తిగ శ్రీనివాస్, నాయకులు పొత్తూరి వెంకటేశ్వరరాజు, కాగిత మహంకాళి, కిన్నెర వెంకన్న, చెన్నంశెట్టి హరినాయుడు, కాగిత బుజ్జి, మంతెన సాయిలచ్చిరాజు, గురుగుబిల్లి సత్యనారాయణ, మజ్జి కృష్ణప్రసాద్, కర్రి శ్రీనివాస్ పాల్గొన్నారు.

మొగల్తూరులో భారీ అన్నసమారాధన

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరులోని కోట రోడ్డులో ఉన్న మరిడి మహాలక్ష్మమ్మ ఆలయ ప్రాంగణంలో ఆదివారం భారీ అన్న సమారాధన నిర్వహించరు. ఇటీవల అమ్మవారి జాతర ఘనంగా నిర్వహించారు. ఉత్సవాలు ముగింపును పురస్కరించుకుని నిర్వహించిన అన్న సమారాధనలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

యాత్రికులతో ముత్యాలమ్మ ఆలయం రద్దీ

మొగల్తూరు : మండలంలోని ముత్యాలపల్లిలో ఉన్న బండి ముత్యాలమ్మ ఆలయం ఆదివారం యాత్రికులతో రద్దీగా మారింది. యాత్రికులు అమ్మవారిని దర్శించుకుని కానుకలు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో బండి ముత్యాలమ్మ భజన సంఘం ఆధ్వర్యంలో ఆలపించిన భక్తి గీతాలు యాత్రికులను ఆకట్టుకున్నాయి. యాత్రికులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ కార్యనిర్వాహణాధికారి దెందుకూరి రామకృష్ణరాజు, ఆలయ ఛైర్మన్ కడలి మాణిక్యాలరావు పర్యవేక్షణలో ఆలయ సిబ్బంది ఏర్పాట్లు చేశారు. పాలకవర్గ సభ్యులు ప్రసాదం వితరణ తదితర సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

తాగునీటి కోసం వెతలు

ధ్వంసమైన పైపులైన్

కొత్తకాయలతిప్పలో మహిళల అవస్థలు

సమస్యను పరష్కరించాలని వేడుకోలు


తాగునీటి కోసం ఖాళీబిందెలతో మహిళలు

ప్రజాశక్తి - మొగల్తూరు

వేసవి ఆరంభంలోనే ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మొగల్తూరు పంచాయతీ పరిధి కొత్తకాయలతిప్ప గ్రామానికి కెపి.పాలెం సమగ్ర రక్షిత తాగునీటి పథకం నుంచి పైపులైన్ ద్వారా శుద్ధి జలలు సరఫరా అవుతున్నాయి. శుద్ధి లాలు సరఫరా చేసే పైపులైన్ ధ్వంసం కావడంతో ఐదు రోజులుగా కొత్తకాయలతిప్ప గ్రామానికి శుద్ధి జలాల సరఫరా నిలిచిపోయింది. దీంతో గ్రామంలోని సుమారు రెండు వేల మంది ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాగు, ఇతర నీటి అవసరాల కోసం ప్రజలు కుళాయిపైనే ఆధారపడుతున్నారు. పైపులైన్ ధ్వంసం కావడంతో శుద్ధి జలాలను ఇతర ప్రాంతాల్లో కొనుగోలు చేసి టిన్నుల్లో తెచ్చుకుంటున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాగునీటి సమస్యను పరిష్కరించాలని ప్రజలు అధికారులను కోరుతున్నారు. ఈ సమస్యను ప్రజాశక్తి ఆర్‌డబ్ల్యూఎస్ డిఇ శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లగా సమస్యను వెంటనే పరిష్కరించి శుద్ధి జలాలు అందిస్తామని చెప్పారు.

మార్టేరు వ్యవసాయ పరిశోధనా స్థానం @ 62 వరి వంగడాలు

దేశ ఆర్థిక వృద్ధికి దోహదం

ఎడిఆర్ డాక్టర్ ధన్యంరాజు శ్రీనివాస్

ప్రజాశక్తి - పెనుమంట్ర

మార్టేరు వ్యవసాయ పరిశోధనా స్థానంలో రూపొందిన పలు వరి రకాలు ప్రాచుర్యంలో ఉన్నాయని ఎడిఆర్ డాక్టర్ ధన్యంరాజు శ్రీనివాస్ అన్నారు. ఆదివారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా సుమారు 350 కోట్ల మంది ప్రజలు వరిని ఆహారంగా తీసుకుంటున్నారన్నారు. ఇందుకోసం సాలీనా దాదాపు 160 మిలియన్ హెక్టార్లలో వరిపంట సాగు చేస్తూ, సుమారు 700 మిలియన్ టన్నుల ధాన్యం ఉత్పత్తి చేయడం జరుగుతుందని తెలిపారు. భారతదేశం ఏడాదికి సుమారు 47 మిలియన్ల హెక్టార్లలో వరి పంటను పండిస్తూ, దాదాపు


మార్టేరు వ్యవసాయ పరిశోధనా స్థానం

వంద మిలియన్ టన్నుల బియ్యాన్ని ఉత్పత్తి చేస్తుందని చెప్పారు. రైతుల అవసరాలకు అనుగుణంగా అనువైన వరి వంగడాలను రూపొందించడంలో మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంకు విశిష్ట స్థానం ఉందన్నారు. 1925లో ఏర్పడిన ఈ కేంద్రం వచ్చే ఏడాది శత జయంతి ఉత్సవాలకు సిద్ధమవుతుందని తెలిపారు. ఈ నూరేళ్ల చరిత్రలో ఈ పరిశోధనా స్థానం 62 రకాల వంగడాలు రూపొందించి, విడుదల చేయడం ద్వారా దేశ ఆర్థిక వృద్ధికి ఎంతగానో దోహదపడిందన్నారు. ఈ పరిశోధనా స్థానం నుంచి విడుదలైన వరి రకాల్లో స్వర్ణ, కాటన్ దొర సన్నాలు, విజేత, శ్రీ ధృతి రకాలు మిక్కిలి ప్రాచుర్యం పొందాయని చెప్పారు. ప్రస్తుతం స్వర్ణ రకం మన దేశంలోనే కాకుండా ప్రపంచంలోని వివిధ దేశాల్లో గణనీయమైన విస్తీర్ణంలో సాగు చేస్తున్నారని తెలిపారు. మార్టేరు స్థానం నుంచి విడుదలైన రకాలు దేశీయంగా సుమారు 20 శాతం విస్తీర్ణంలో సాగు చేయబడుతూ, దేశ వరి ఉత్పత్తిలో 25 శాతం సాధించడం ఈ స్థానం విశిష్టతకు తార్కాణమని డాక్టర్ శ్రీనివాస్ చెప్పారు. వ్యవసాయ రంగ అభివృద్ధి పట్ల, రైతాంగ సమస్యల పట్ల ప్రజాశక్తి యాజమాన్యానికి ఉన్న నిబద్ధతను ఆయన ప్రత్యేకంగా ప్రశంసించారు.

పలుచోట్ల ఘనంగా ఈస్టర్ వేడుకలు

ప్రజాశక్తి - నరసాపురం

ఈస్టర్ పండుగను పురస్కరించుకుని పట్టణంలోని పలు చర్చిల్లో తెల్లవారుజాము నుంచే వేడుకలు ఘనంగా నిర్వహించారు. సమాధుల వద్ద కొవ్వొత్తులు వెలిగించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చర్చిల్లో ప్రత్యేక పాటలు ఆలపించారు. పట్టణ, మండలంలో పలు చర్చిలు సందడిగా కనిపించాయి.

కాళ్ల : మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం ఈస్టర్‌ను క్రైస్తవులు ఘనంగా నిర్వహించారు. చర్చిలో విశేషాలంకరణలు చేసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా సిఎస్ఐ, ఆర్‌సిఎం, సిబిసిఎన్‌సి, ఇహెచ్‌హెచ్ ప్రార్థనా మందిరాల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. పాస్టర్ ఇస్మాయిల్ మాట్లాడుతూ శుక్రవారం శిలువపై మరణించిన ఏసుక్రీస్తు మూడో రోజు ఆదివారం రోజు మరణాన్ని జయించి పునరుత్థానుడైన పవిత్ర దినాన్ని ఈస్టర్‌గా జరుపుకుంటారని వివరించారు. చర్చిల్లో ప్రత్యేక పాటలు ఆలపించారు. కాళ్లలో నిర్వహించిన వేడుకల్లో ఉండి స్వతంత్ర ఎంఎల్ఎ అభ్యర్థి వేటుకూరి వెంకటశివరామరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన క్రైస్తవులందరికీ ఈస్టర్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ పి.ఇస్సాకు, రెక్సీబాబు, మోపిదేవి నాగశ్రీనివాస్, ఆయా సంఘాల విశ్వాసులు, సంఘపెద్దలు పాల్గొన్నారు.

ఆచంట : మండలవ్యాప్తంగా క్రైస్తవులు ఈస్టర్ పండుగను ఘనంగా నిర్వహించారు. కుటుంబ సభ్యులు, స్నేహితులు శ్మశానవాటికల్లో సమాధులకు రంగులు వేసి పూలతో అలంకరించారు. ఆదివారం తెల్లవారుజామున సమాధుల వద్ద కొవ్వొత్తులు వెలిగించి ప్రత్యేక ప్రార్థన చేశారు. ఆచంట, కొడమంచిలి, పెనుమంచిలి, వల్లూరు, ఆచంట వేమవరం, కరుగోరుమిల్లి శేషమ్మ చెరువు పలు గ్రామాల్లో ఈస్టర్ పండుగను నిర్వహించారు.

పాలకొల్లు : పట్టణంలోని పలు చర్చిల్లో ఆదివారం తెల్లవారుజాము నుంచే ఈస్టర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని సమాధులు వద్ద కొవ్వొత్తులు వెలిగించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చర్చిల్లో ప్రత్యేక పాటలు ఆలపించారు. పట్టణ, మండలంలో పలు చర్చిలు సందడిగా కనిపించాయి.

మొగల్తూరు : మండలంలోని పలు గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. క్రైస్తవులు వారి పూర్వీకుల సమాధులకు రంగులు వేసి పూలతో అలంకరించారు. మొగల్తూరులోని ఆర్‌సిఎం చర్చి ఫాదర్ పాలపర్తి వారిపేటలోని క్రీస్తు లోథర్, దేవాలయం ఫాదర్ గోడి యోసోబురాజు పలు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

భీమవరం రూరల్ : ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ పట్టణంలోని పలు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బేతనిపేట చర్చి, లూథరన్ చర్చి, తాడేరు పెద్ద చర్చి, కల్వరి చర్చి, రూపాంతర దేవాలయాలను ఆయన దర్శించ్కుఉన్నారు. ఆయనతో పాటు తోట భోగయ్య, కోడె యుగంధర్ ఉన్నారు.

మావుళ్లమ్మ సన్నిధిలో జిల్లా జడ్జి పురుషోత్తంకుమార్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

పట్టణంలో ఉన్న మావుళ్లమ్మను జిల్లా జడ్జి సి.పురుషోత్తంకుమార్ దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ అర్చకులు మద్దిరాల మల్లికార్జునశర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి బుద్ధ మహాలక్ష్మి నగేష్ శేషవస్త్రంతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

నరసాపురం ఎంఎల్ఎ అభ్యర్థిగా కాపు నేత

మాజీ సర్పంచి రంగారావు

ప్రజాశక్తి - నరసాపురం

వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో నరసాపురం ఎంఎల్ఎ అభ్యర్థిగా ఒక రాజకీయ పార్టీ నుంచి కాపు సామాజిక తరగతికి చెందిన విద్యావంతుడు, మేధావి పోటీలో నిలుస్తారని యర్రంశెట్టిపాలెం గ్రామ మాజీ సర్పంచి కూనపరెడ్డి వీరవెంకటవిజయరంగారావు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నరసాపురం నియోజకవర్గానికి చెందిన కాపు సంఘియుడుగా ఉన్న ఆయనకు ఇతర సామాజిక తరగతులతోనూ స్నేహపూరిత సత్సంబంధాలు ఉన్నాయని తెలిపారు. ఉన్నత కుటుంబానికి చెందిన ఆయన కావడమే కాకుండా సమాజానికి, పేదలకు అత్యుత్తమ సేవలందించి మంచి సేవా తత్పరుడిగా గుర్తింపు పొందారన్నారు. ఆయనకు రాజకీయంలో కూడా విశేష అనుభవం ఉందని తెలిపారు. త్వరలో నరసాపురం నియోజకవర్గ ఓటర్లను ఆయన కలుస్తారని తెలిపారు.

జనసేనలో చేరిక

ప్రజాశక్తి - నరసాపురం

మండలంలోని సమకూరుపాలెం గ్రామానికి చెందిన వైసిపి నాయకులు జనసేన పార్టీలో చేరారు. జనసేన నరసాపురం ఎంఎల్ఎ అభ్యర్థి బొమ్మిడి నాయకర్ వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కలవకొలను తాతాజీ, ఆకన చంద్రశేఖర్, బందుల రవీంద్ర పాల్గొన్నారు.

గంజాయి వల్ల కలిగే అనర్థాలపై అవగాహన

ప్రజాశక్తి - గణపవరం

గంజాయి వలన కలిగే అనర్థాలపై మండలంలోని పాత నిందితులకు గణపవరం పోలీస్‌స్టేషన్‌లో నిడమర్రు సిఐ సుభాష్, గణపవరం ఎస్ఐ వి.వెంకటేశ్వరరావు ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాత నిందితులందరూ సత్ప్రవర్తనతో కలిగి ఉండాలన్నారు. ఎన్నికల సమయంలో ఎటువంటి అల్లర్లకు తావివ్వకుండా ఉండాలని సూచించారు.


అవగాహన కల్పిస్తున్న సిఐ, ఎస్ఐ

నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా

జనసేన నరసాపురం ఎంఎల్ఎ అభ్యర్థి బొమ్మిడి నాయకర్

ప్రజాశక్తి - నరసాపురం

నన్ను గెలిపిస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానని జనసేన నరసాపురం ఎంఎల్ఎ అభ్యర్థి బొమ్మిడి నాయకర్ అన్నారు. మండలంలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజుతో కలిసి ఆయన ఆదివారం ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా బొమ్మిడి నాయకర్ మాట్లాడుతూ వైసిపి అధికారంలో ఉన్న ఐదేళ్లలో అభివృద్ధి శూన్యమన్నారు. యువతకు ఉద్యోగాలు లేక చదువులు పూర్తయిన తర్వాత ఇతర రాష్ట్రాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. రానున్న రోజుల్లో చంద్రబాబు, పవన్ నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. చంద్రబాబుకు తెలుగు రాష్ట్రాల్లో 14 ఏళ్లు సిఎంగా పనిచేసిన అనుభవం ఉందన్నారు. నియోజకవర్గంలో తాగునీటి సమస్యను పరిష్కరిస్తామన్నారు. టిడిపి నరసాపురం నియోజవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు మాట్లాడుతూ ప్రజల ఆదరణ చూస్తుంటే ఇప్పటివరకు ఏ అభ్యర్థికి రాని మెజార్టీ నాయకర్‌కు వస్తుందన్నారు. సిఎం జగన్ వల్ల రాష్ట్రం అప్పులపాలైందన్నారు. నాయకర్‌కి తన మద్దతు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆకన చంద్రశేఖర్, కటకంశెట్టి సంజీవరావు, సుధాకర్, కంచర్ల ఫణికర్, కంచర పృథ్వి, తోట చిన్న, కటకంశెట్టి పెద్దిరాజు పాల్గొన్నారు.

నాపై ఎంఎల్ఎ నిమ్మల వ్యాఖ్యలు తగదు

వైసిపి పాలకొల్లు ఎంఎల్ఎ అభ్యర్థి గోపీ ఖండన

పాలకొల్లు : ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు తనను వలస పక్షి అని సంభోదించడాన్ని తాను తీవ్రంగా ఖండిస్తు న్నానని వైసిపి పాలకొల్లు ఎంఎల్ఎ అభ్యర్థి గుడాల గోపీ తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. తాను అద్దె ఇంట్లో ఉంటున్నా సంతోషంగా ఉన్నానని, ఎంఎల్ఎ సొంతింట్లో ఉన్నా సంతోషంగా లేరని చెప్పారు. మంత్రి పదవి కోసం నారా లోకేష్‌కు రూ.18 కోట్లు ఇచ్చి ఫెయిలయ్యారని, తిరిగి ప్రజల్లో దోచుకోవడానికి మూడోసారి ప్రయత్నిస్తున్నారని చెప్పారు. నిత్యం ప్రజల్లో ఉంటున్నానని చెబుతున్న నిమ్మల వైఖరిని తీవ్రంగా ఖండించారు. లోకేష్ కుప్పంలో పుట్టి మంగళగిరిలో, బాలకృష్ణ నిమ్మకూరులో పుట్టి హిందూపూర్‌లో ఎందుకు పోటీ చేస్తున్నారని ప్రశ్నించారు. 2004 వరకు తాను పుట్టిన వీరవాసరం మండలం పాలకొల్లు నియోజకవర్గంలో ఉందనే విషయం నిమ్మలకు తెలియకపోవడం ఆశ్చర్యంగా ఉంద న్నారు. తనకు ఎటువంటి కమిషన్లు అవసరం లేదని, అభివృద్ధి, సంక్షేమం ఏకైక లక్ష్యంగా నియోజకవర్గ అభివృద్ధికి కషి చేస్తానని చెప్పారు.

గొయ్యి.. అదుపుతప్పితే ప్రమాదమొయ్యి

యనమదుర్రు రోడ్డులో భారీ గుంత

భయాందోళనలో వాహనదారులు

పట్టించుకోని అధికారులు


యనమదుర్రు రోడ్డులో ప్రమాదకంగా ఉన్న భారీ గొయ్యి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

స్థానిక ప్రభుత్వాసుపత్రి సమీపంలో యనమదుర్రు డ్రెయిన్‌కు ఆనుకుని వంతెనకు సమీపంలో యనమదుర్రు గ్రామం వైపు వెళ్లే రహదారిలో గొయ్యి ప్రమాదకరంగా ఉంది. అయినా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడంలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గొయ్యి చూస్తేనే ప్రమాదకరంగా ఉందని, ఈ రహదారిపై నిత్యం ఎంతోమంది వాహనదారులు రాకపోకలు సాగిస్తారు. అంతేకాకుండా ఈ రహదారిపై నిత్యం స్కూల్ బస్సులు తిరుగుతాయి. ఆక్వా కంపెనీలు అయినటువంటి అశ్విని మెరైన్, సూర్యమిత్ర మెరైన్‌లతో పాటు ఆక్వా ట్రేడర్స్ వాహనాలు కూడా ఎక్కువగా రాకపోకలు తిరుగుతుంటాయి. రోజురోజుకు గొయ్యి పెరిగి ప్రస్తుతం పది అడుగులపైగా లోతు, అదే మాదిరిగా వెడల్పుతో ప్రమాదకరంగా మారింది. ఎప్పుడు ఏ ప్రమాదం చోటు చేసుకుంటుందోనని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఈ గోతిలో పడితే ద్విచక్ర వాహనదారులు కనీసం కనిపించని విధంగా ఉంది. రాత్రి సమయంలో ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహించారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గొయ్యిపడి ఎన్నో రోజులైనప్పటికీ మున్సిపల్ అధికారులు పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తక్షణమే గొయ్యిని పూడ్చాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

వైసిపి అసమర్ధ పాలనతో అభివృద్ధి శూన్యం

తోట సీతారామలక్ష్మి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

వైసిపి అసమర్ధ, అవినీతి పాలనతో రాష్ట్రంలో అభివృద్ధి నిలిచిపోయిందని టిడిపి జిల్లా అధ్యక్షురాలు, భీమవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోట సీతారామలక్ష్మి అన్నారు. ఆదివారం ఆమె కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. బాధ్యత ఉన్న నేతగా మన కోసం చేసే పోరాటంలో ప్రజలందరూ చంద్రబాబుకు అండగా నిలవాలన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధిలో ముందుకు తీసుకెళ్లే బాధ్యత చంద్రబాబు తీసుకుంటారన్నారు. రాష్ట్రంలో రానున్నది ప్రజా ప్రభుత్వమేనన్నారు.

'అభివృద్ధే గెలిపిస్తుంది'

ప్రజాశక్తి - పెనుమంట్ర

వైసిపి ప్రభుత్వం గడచిన ఐదేళ్ల కాలంలో చేసిన అభివృద్ధే మళ్లీ గెలిపిస్తుందని పెనుమంట్ర జెడ్‌పిటిసి సభ్యులు కర్రి గౌరీ సుభాషిణి అన్నారు. ఆదివారం ఆమె మార్టేరులో విలేకర్లతో మాట్లాడుతూ పెనుమంట్రలో వైసిపి ఎన్నికల ప్రచార కార్యక్రమం సోమవారం నిర్వహించనున్నట్లు చెప్పారు.